వాడికో "థ్యాంక్స్" పారేసి, మరో అరగంట వాడితో ఊక దంపి, ఇంటికి బయల్దేరాను, ఆనందంగా.

రాత్రికి భోం చేసి మంచం ఎక్కి, ట్యూబు తీశాను రాద్దామని. తీరా పెట్టె లోంచి బయటికి తీస్తే, ఆ ట్యూబెంతుంది! మల్లెపువులో మంచు బిందువంత !

మెల్లిగా దాని మూత తీసి, దాని మూతి కుడిచేతి చూపుడు వేలిమీద ఆనించి, ఎడం చేత్తో ట్యూబు క్రింద మెల్లిగా నొక్కాను. ఆ యి ం ట్ మెం టు రా లే దు. మ రి కా స్త నొ క్కా ను. ఊహుఁ! మరికాస్త! ఊహు ! "పీడి కక్కుర్తి తగలెయ్య! సగమే నింపాదేమిటి ట్యూబు" అని అనుకుంటూ మ రి కా స్త గట్టిగా వత్తాను. ఏముంది! "బుస్" మంటూ కాస్త గాలి, ఓ చిన్న బుడగ. అప్పటికే ట్యూబంతా అయిపోయింది. ఆ మెడ దగ్గర మాత్రం కాస్త మిగిలింది. ఒళ్ళు మండి పోయి రెండు చేతుల్తో గట్టిగా పట్టుకుని రాక్షసుడల్లే ఆ మెడ దగ్గర పిసికేశాను. అంతో యింతో కొంచెం ఉంటే అది బయటకి వస్తుందికదా అని.

అంతే! ఆ దెబ్బకి ఓ పెసర గింజంత ఆయింట్‌మెంటు సన్న తీగలాగా సాగి, "పుఛుక్" మంటూ ఎగిరి, ప్రక్కనే టేబుల్ మీద తిరుగుతున్న "మోహిని ఫ్యాన్" లోకి వెళ్ళిపోయింది– అదికాస్తా, ఆ కాస్తనీ, గోడమీది దేవతలకి అమృతం లాగా పంచేసింది. ★

# పోయేకాలమ్ కథ



ప్రసన్నకుమార్ సర్రాజు

ముసలాయనకు ఒంట్లో నలతగావుంటే ఫ్యామిలీ డాక్టరు వచ్చి టెస్టులన్నీ చేశాడు. కొడుకులూ, కోడళ్ళూ ఆదుర్దా పడుతూ డాక్టరుగారిని సాభిప్రాయంగా చూస్తున్నారు– రిజల్ట్ ఏదైనా, రోగి దగ్గర చెప్పకుండా అసింటా ప్రక్కకు తీసికెళ్ళి చెప్తాడని.

ఆయన సినిమా డాక్టరు కాదు బంధువుల్ని పక్కకి తీసికెళ్ళి రోగి వినేట్లు పెద్దగా చెప్పడానికి. నిజం డాక్టరు. అందుకని అక్కడే చెప్పేశాడు: అది "కారాకిళ్ళి యోమియ" అని. అంటే ముసలాయనికి అత్యంత ప్రీతిపాత్రమైన కారా కిళ్ళీలు అదే పనిగా నవలడం వల్ల స్టమక్ అప్‌సెట్ అయిందని, వెంటనే మానెయ్యక పోతే అది అల్సర్‌కి దారితీయొచ్చని.

కొడుకులు కోడళ్ళు వెంటనే ముసలాయన్ని కట్టడిచేశారు. ప్రేమగా మందలించారు. కారా కిళ్ళీ జోలికెడితే ఊరుకోం అని ఆపేక్షగా కసిరారు. ఈ రోజు నుంచీ ఆయన కారా కిళ్ళీ వేసుకోకుండా చూసే బాధ్యత మాది అని డాక్టరుకి హామీఇచ్చారు. డాక్టరు సంతృప్తిగా వెళ్ళిపోయాడు.

ముసలాయనకి చాలా అభిమానం. మొహమాటస్థుడు. ఆ యనకి ఎలా అలవడిందో ఈ ఒక్క కారా కిళ్ళీ తప్ప ఇంకే వ్యసనమూ లేదు. మళ్ళీ కారాకిళ్ళీ మాటెత్తకుండా వేళకి మందులు, పళ్ళ రసాలూ అందించే కోడళ్ళ పర్యవేక్షణలో కాలం గడపసాగాడు. పువ్వులా చూసుకుంటున్నారాయన్ని.

నెలరోజులు గడిచింది. నెల క్రితం చూసిన వాళ్ళు ఇప్పుడు చూస్తే ముక్కుమీద వేలేసుకుంటున్నారు. అంతగా చిక్కిపోయాడు. డాక్టరు వచ్చి ఇంకొన్ని మందులు రాసిచ్చి, రహస్యంగా గానీ కారా కిళ్ళీ వేసుకుంటున్నాడేమో అని అనుమానం వ్యక్తపరిచాడు. కోడళ్ళు, కొడుకులూ గట్టిగా చెప్పారు అటువంటిదేమీ లేదని.

ఇంకోనెల గడిచింది. ఈసారి డాక్టరుతో పాటు లాయరూ వచ్చాడు ముసలాయన కొనవూపిరితో వున్నాడు.

వచ్చే కాలం చూడండి!

పోయిన కాలమ్ తరువాయి: ఆస్థి పంపకాలయాయి. ఇంక ఐదు నిముషాలు–

అంతే అని చెప్పేశాడు డాక్టరు. అంతా మంచం చుట్టూ చేరారు. ముసలాయన కళ్ళు అందర్నీ నిస్తేజంగా చూశాయి. కొడుకులూ, కూతుళ్ళూ, కోడళ్ళూ మనవలూ, మనవరాండ్రు.

అరగంటయింది. రెండుగంట లయింది, సాయంత్రమయింది ప్రాణంపోవటంలేదు, ఎవరో పెద్దాయన చెప్పాడు.... "అందరూ దగ్గరున్నారా! లేక రావలసిన వాళ్ళెవరయినా రావాలా? ప్రాణం పోవటంలేదు. బంధువులందర్నీ లెక్కపెట్టారు. అంతా వున్నారు. మరింకెవరికోసం ముసలాయన ఎదురుతెన్నులు.

ముసలాయన విధవప్పగారికి తట్టింది. "తమ్ముడికి చిన్నప్పటి నుంచి కారా కిళ్ళీ అంటే ప్రాణం. ఈ మాయదారి జబ్బొచ్చిన దగ్గర్నుంచీ తినడమే మానేశాడు" అని రాగాలుతీసింది.

పెద్దకొడుకు డాక్టర్‌ని సంప్రదించాడు. ఆయనకి ఇటువంటి సెంటిమెంట్ల మీద నమ్మకంలేదు, సరే కాని ఎలాగూ పోయే ప్రాణం. నా డ్యూటీ రోగి ప్రాణం పోయే దాకానే కదా అనుకుని అభ్యంతరపెట్టలేదు.

నౌకరు పరుగెత్తుకెళ్ళి ఘుమఘుమలాడేట్లు స్పెషల్‌గా కారాకిళ్ళీ కట్టించితెచ్చాడు పెద్దయ్యగారికి ఆఖరి కిళ్ళీ ఇదేగదా అని కళ్ళొత్తుకుంటూ.

పెద్ద కొడుకు తండ్రి చెవిలో మెల్లగా నాన్నా అని పిలిచాడు. నెమ్మదిగా కళ్ళు తెరచుకున్నై. వెంటనే ఆయన చూసేలోగా కళ్ళముందు పెట్టి గోరుతో ఓ పక్క చిన్న రంధ్రం చేసి నోటి దగ్గర పెట్టారు. తులసి తీర్థానికి కూడా తెరుచుకోని నోరు నెమ్మదిగా తెరుచుకుంది. కిళ్ళీ నోట్లో పెట్టారు.

వెంటనే కళ్ళు మూతపడ్డయ్.

నిమిషం తర్వాత దవడలు నెమ్మదిగా కదిలాయి,

మెల్లగా చప్పరిస్తున్నాడు.

రసం గొంతులోకి వెళ్ళాక గుటక వేశాడు.

ప్రాణం లేచొచ్చినట్లయింది.

మొహంలోకి కళాకాంతులు తిరిగి వచ్చాయ్.

అంతే.. ఆ తర్వాత కలకాలమ్ హాయిగా బతికాడాయన–కారాకిళ్ళీలు నవుల్తూ. ★